# పెద్దల సబ్బాతుబడి పాఠములు

# పరలోకము మరియు భూమి ఐక్యపర్చబడెను ఫిలిప్పీయులకు మరియు కొలొస్సయులకు వ్రాసిన పత్రికలలో యేసును గూర్చి నేర్చుకొనుడి

## మొదటి త్రైమాసం-2026



**జనవరి, ఫిబ్రవరి, మార్చి -2026**


గ్రంథకర్త

**క్లింటన్ వాహ్ లెన్**

అనువాదం

**చింతా ప్రకాష్**

10వ పాఠం ఫిబ్రవరి 28-మార్చి 6

# యేసునందు పరిపూర్ణమగుదు

**సబ్బాతు మధ్యాహ్నము :** **ఫిబ్రవరి 28**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : కొలొస్సయి 2:1-7, యెషయా 61:3; కొలొస్సయి 2:11-15; కొలొస్స 2:16-19; కొలొస్సయి 2:20-23.**

**కంఠతవచనం : "కాబట్టి అన్నపానముల విషయములోనైనను, పండుగ అమావాస్య విశ్రాంతి దినము అనువాటి విషయములోనైను, మీకు తీర్పు తీర్చనెవనికిని అవకాశమియ్యకుడి. ఇవి రాబోవు వాటి ఛాయయే గాని, నిజస్వరూపము క్రీస్తులో ఉన్నది" (కొలొస్స 2:16,17).**

సబ్బాతుదినము (ఏడవదిన విశ్రాంతిని) నీవెందుకు గైకొనుచున్నావని ప్రజలు నిన్ను అడుగుచున్నారా? సబ్బాతుదినమును గైకొనవసరములేదు అని బోధించే వారికి ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన కంఠత వచనమును రుజువుగా చూపించుచు ఉండవచ్చును. అయితే కొలొస్సయి 2:16,17లోని ఈ వచనములు 4వ ఆజ్ఞను గూర్చి మాట్లాడుటలేదు. నిజముగా ఈ వాక్యము సంఘములో బోధించుచున్న అబద్ధ బోధలను గూర్చి మాట్లాడుచున్నది. ఆ అబద్ధ బోధనలు ఏమిటి?

మొదటగా ఈ అబద్ధ బోధనలలో భాగముగా యూదుల పండుగ దినములను ఆచరించవలెననియు మరియు సున్నతి పొందవలెననియు వంటి బోధనలు ఉండెడివి. సున్నతి పొందిన మగవాడు అనగా, అతని గోప్యాంగచర్మము త్రుంచి వేయబడినప్పుడు, ఆ మనిషి దేవునికి చెందినవాడుగా చూపేవారు. అందుచేత క్రైస్తవులైన వారు దేవునికి చెందిన వారని చూపించుటకు సున్నతి తప్పనిసరిగా పొందాలి అనే తప్పుడు బోధనను సంఘములోనికి తీసుకొని వచ్చారు. ఇంకా అబద్ధ బోధలలో అపవిత్రమైన వాటిని తినకూడదనే నియమము కూడా ఉన్నది (కొలొస్స 2:16,21).

అబద్ధ బోధకులనబడేవారు, మతపరమైన మనుష్యులే. బైబిలు సత్యమును గూర్చి జాగ్రత్తగా అమలు చేయబడాలని కోరేవారే. అయితే వారు యేసును గూర్చిన శుభవార్తను వారు అర్థము చేసుకోలేదు. వారు ఎందువలన అర్థము చేసుకొనలేకపోయిరో ఈ వారము మనకు అర్థమవుతుంది. మరియు ఈ వారము యొక్క కంఠత వచనము, 7వ దిన సబ్బాతును గైకొనే విషయమును గూర్చి ఎందుకు మాట్లాడుట లేదో కూడా తెలుసుకొనబోవుచున్నాము.

– మార్చి 7, సబ్బాతు దినమున, ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతు బడి పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం మార్చి 1

## దేవుని గూర్చిన జ్ఞానము మరియు వివేకము (కొలొస్స 2:1-7)

యోబు ఈ విధముగా అడిగెను. "అయితే జ్ఞానము ఎక్కడ దొరకును. వివేచన దొరకు స్థలము ఎక్కడనున్నది" (యోబు 28:12)? అది యేసునందు దొరుకునని పౌలు జవాబునిచ్చుచున్నాడు. "బుద్ధి జ్ఞానము సర్వ సంపదలు ఆయనయందే గుప్తములైయున్నది" (కొలస్సి 2:3; 1కొరింథి 1:30తో పోల్చి చూడుడి). మనము యేసును కలిగి యుంటే, మనము సమస్తమును కలిగియున్నామని అర్థము. "దేవుని యొక్క రక్షణ ప్రణాళికను చాలా పరిపూర్ణముగా అర్థము చేసుకొనుటకు యేసు మనకు సహాయము చేయును" (కొలొస్స 2:2) యేసులో మనము రక్షింపబడుదుమనే దేవుని యొక్క ప్రణాళికను ఆయన మనకు చూపించును.

**కొలొస్స 2:1-7 చదువుడి. కొలొస్సలో ఉన్న సంఘమునకు పౌలు ఈ పత్రికను వ్రాయుటకు గల కారణము ఏమిటి?**

గ్రీకు పదము "పారా క్లిథోపిన్" అనగా ఆదరణ పొందుట లేక ప్రోత్సహించబడుటకు (కొలొస్స 2:2) లేక బలవంతులగునట్లు (కొలొస్స 2:2) అని అర్థము. అబద్ధ బోధనల వలన కలుగు ప్రమాదములను సభ్యులు గ్రహించులాగున వారికి సహాయపడాలనే పౌలు యొక్క కోరిక. క్రైస్తవ సంఘము యొక్క ప్రేమలో అతుకబడునట్లు చేయుటకు పౌలు వారికి సహాయపడాలనే కోరిక కలిగియున్నాడు. దానికి అవసరమైన విషయాలలో ఈ పత్రిక వారిని నడిపిస్తుందని పౌలు నమ్మెను.

కొలొస్సయిలో ఉన్న సంఘ సభ్యులు అందరూ కలిసి యోగ్యమైన ప్రవర్తన మరియు క్రీస్తునందు స్థిర విశ్వాసమును కలిగియున్నందుకు పౌలు దేవునికి స్తుతులు చెల్లించుచుండెను (కొలొస్స 2:5). ఆ సంఘమునకు బలమైన నాయకత్వము ఉండుట చూచి పౌలు సంతోషించెను. తరచుగా నాయకత్వము యొక్క బాధ్యత సంఘ పరిపాలన వ్యవహారములను చూచుటయే అని అనేకులు భావిస్తారు. వారికి సంఘములో జరుగు ఆరాధన గురించి బాధ్యత ఉండదనుకుంటారు. అయితే పౌలుకు అర్థమైన విధముగా చూచినట్లయితే క్రైస్తవ సంఘ నాయకత్వము మరియు సంఘారాధన ఈ రెండు కూడా జత చేయబడి ఒకటిగా కలిసియున్నవి. క్రైస్తవ సంఘమును ఆరాధనలో సరియైన విధానములో నడిపించవలసియున్నదని పౌలు నమ్మాడు (1కొరింథి 11) అందువలననే సంఘ నాయకులను ఏవిధంగా ఎంచుకొనవలెనో తిమోతి మరియు తీతుకు చాలా వివరముగా ఉపదేశించెను (1తిమోతి 3; తీతు 1) బలమైన నాయకులు సంఘము ఎదుగునట్లు సహాయపడుదురు. దేవుని జ్ఞానమును బైబిలు సత్యమును గౌరవింతురు. ఈ నాయకులు దైవ జ్ఞానమును బైబిలు సత్యమును ఇతరులతో పంచుదురు.

పౌలు యొక్క సహ పనివారు సంఘముతో నిజమైన వర్తమానములను పంచుకున్నారు. అందువలననే కొలొస్స సంఘము విశ్వాసములో బలముగా నిలిచెను. వారి విశ్వాసమును బైబిలు సత్యముతో ఆధారము చేసుకున్నారు. పోషింపబడినారు. బైబిలు సత్యమును అనుసరించినపుడు అబద్ధ బోధనలనుండి మనము కాపాడబడుదుము.

**గత కాలములో బలమైన సంఘ నాయకత్వము నీ ఆధ్యాత్మిక జీవితము బలముగా ఎదుగుటకు ఏవిధముగా సహాయపడెను? బలమైన ఆధ్యాత్మిక సంఘ నాయకత్వము నీ ఆరాధన అనుభవము మేలుకరముగా ఉండులాగున ఎట్లు మార్పు చెందెను?**

**సోమవారం** **మార్చి 2**

## యేసునందు ఎదుగుట (యెషయా 61:3)

క్రైస్తవ జీవితమును ఏవిధముగా జీవించాలి అనే అంశముపై కొలొస్సయులకు వ్రాసిన పత్రిక దృష్టి పెట్టింది. "కావున మీరు ప్రభువైన క్రీస్తుయేసును అంగీకరించిన విధముగా ఆయనయందు వేరుపారినవారై" (కొలొస్స 2:6). మనము సత్యమును అంగీకరించినప్పుడు ఒక నిజమైన వ్యక్తిని (యేసును) అంగీకరిస్తున్నాము తప్ప ఏవో కొన్ని నియమాలతో కూడిన కొన్ని బోధనలను అంగీకరించుట కాదు. అదే సమయములో మనము యేసును అంగీకరించినప్పుడు ఆయన బోధనలన్నింటిని మనము అంగీకరిస్తున్నాము (ఎఫెసి 2:20).

మనము యేసును అంగీకరించినప్పుడు మనము మన స్వార్ధమును విడిచి పెట్టి వేస్తాము. ఇక మనలో స్వార్ధము చచ్చిపోయినట్లే, సజీవుడైన యేసుకు మన జీవితములను పరిపూర్ణముగా సమర్పించుకుంటాము.

యేసు జీవించుచున్న వాక్యమై యుండెను. జీవించుచున్న వాక్యము వ్రాతరూపములో ఉన్న వాక్యము నుండి (బైబిలు నుండి) వేరుచేయబడదు. నిజముగా కేవలం వాక్యము నుండే యేసును తెలుసుకొనగలము. యేసునందు మనము ఏవిధంగా జీవించాలో బైబిలు బోధిస్తుంది. మనలను సక్రమమైన మార్గములో నడుచుకొనునట్లు, మనము చేసే ప్రతి పనియందు, తీసుకొనే తీర్మానములయందు, మనలను నడిపించుటకు బైబిలు సత్యమును మరియు పరిశుద్ధాత్మను అనుమతించవలెను.

కొలొస్స 2:7లో పౌలు ఒక చిహ్నమును ఉపయోగించి క్రైస్తవుల జీవితాలను చెట్లతో పోల్చి బోధిస్తున్నాడు. పౌలు ఈ విధముగా చెప్పెను. "మీ హృదయములు యేసునందు వేరుపారినట్లు ప్రవర్తించుట ద్వారా మనము యేసుతో సంబంధమును కలిగియుందుము. యేసును మన రక్షకునిగా అంగీకరించినపుడు, ఆయన బోధనలను కూడా అనుసరించి జీవిస్తాము. అప్పుడు మనము ఆయనయందు ఎదుగుదుము" (కొలొస్స 2:7).

**యెషయా 61:3; మత్తయి 3:10; లూకా 8:11-15 మరియు 1కొరింథి 3:6**

**మొక్కలను గూర్చిన చిహ్నమును మనము బాగుగా అర్థము చేసుకొనుటకు ఈ వాక్యాలు ఏవిధంగా సహాయపడును? క్రైస్తవులముగా విశ్వాసమును గూర్చి ఈ చిహ్నము మనకు ఏవిధముగా చూపిస్తున్నవి?**

పౌలు రెండు రకాలైన మొక్కలను గూర్చి మాట్లాడుచు వాటి వలె ఉండుటకు క్రైస్తవులు ఎన్నిక చేసుకొనవచ్చని తెలియజేసాడు. మొదటి చెట్టు మస్తకి వృక్షము పోలిన యెహోవా నాటిన మంచి చెట్టుగా క్రైస్తవులున్నారు (యెషయా 61:3) ఈ మంచి చెట్లను పోలిన క్రైస్తవులు ప్రభువునందు ఎదుగుదురు. వారు యేసును ఆయన బోధనలను అంటి పెట్టుకునే యుంటారు. రెండవది కృత్రిమమైనది. ఈ చెట్లు సజీవమైనవిగా కనిపిస్తాయి. అవి ప్రాణములేనివి. మానవ బోధనలను మనుష్యులు నియమించిన చట్టములను భావాలను అనుసరించినడుచుకున్నపుడు కూడా, బానిసత్వములో జీవించిన వారముగా ఉంటాము (కొలొస్స 2:8). యేసు మనలను పాపమునుండి స్వతంత్రులనుగా చేసెను. అయితే మనము తిరిగి బానిసలముగా మారిపోవచ్చు (గలతీ 5:1తో అపొ.కా. 15:10తో పోల్చుడి).

**మనము అబద్ద బోధలను అంగీకరించినపుడు, యేసును తిరస్కరిస్తున్నామని అర్థము. ఎందువలనంటే అబద్ద బోధనలు యేసును గూర్చిన శుభవార్త నుండి వేరుచేయును. వాటిని అంగీకరిస్తే సత్యమునకు బదులుగా మానవ భావాలు అంగీకరిస్తున్నామని అర్థము (గలతీ 1:6-9). నూతన నిబంధన కాలమునాటి క్రైస్తవులు ఈ పొరపాటును చేసే ప్రమాదములో ఉన్నారు.జాగ్రత్తపడనిచో మనము కూడా అదే పొరపాటును చేసే ప్రమాదములో పడిపోతాము.**

**మంగళవారం** **మార్చి 3**

## సిలువకు మేకులతో కొట్టబడెను (కొలొస్స 2:11-15)

**కొలొస్సయులు బైబిలు సత్యమును అర్థము చేసుకోవాలని పౌలు వారిని కోరియున్నాడు? జవాబు కొరకు కొలొస్సయులు 2:11-15 చదువుడి.**

ఏడవదిన సబ్బాతును మనము గైకొనవసరములేదని చెప్పుటకు సాకుగా ఎంతమంది తరచుగా ఈ వాక్యాలను ఎత్తి చూపుట మనము చూచుట లేదా? రెండు వేర్వేరు వివరణముల ద్వారా ఈ వాక్యాలను అర్థము చేసుకొనుటకు సహాయపడును. మొదటగా 'పాతనిబంధనలో' మనకు విరోధముగా వ్రాయబడిన ఆజ్ఞలను గూర్చి చూద్దాము (కొలొస్స 2:14). ఈ విషయాలను యేసు యొక్క సిలువ మీద వ్రేలాడదీసిన పిలాతు యొక్క వ్రాతలతో పోల్చి చూడవచ్చును (మత్తయి 27:37; యోహాను 19:19,20). రెండవ విషయము మోషే యొక్క అర్పణలకు సంబంధించిన ఆజ్ఞలను (ద్వితీయోప 31:24-26 చూడుడి) సిలువకు మేకులతో కొట్టబడెను.

మనము కొలొస్స 2:14ను దాని చుట్టూ ఉన్న ఇతర వాక్యములను చూచినప్పుడు కొలొస్స 2:14 అర్పణలకు సంబంధించిన ఆజ్ఞలను గూర్చి మాట్లాడుచున్నట్లు గమనించవచ్చును.

పౌలు ఇంకా ఈ విధముగా చెప్పెను. "నీవు దేవునికి చెందినవాడవని చూపించుటకు క్రీస్తు తానే స్వయముగా నిన్ను సున్నతి చేసిన వానిగా చేసెను" అని చెప్పెను (కొలొస్స 2:11). సున్నతి చేయబడుట అనగా మగ వాని గోప్యాంగ చర్మమును త్రుంచివేయుట అని అర్థము. పౌలు సున్నతి చేయబడుట అనగా దానిని ఒక వర్తమాన పటముగా చూపించి 'నీ పాత స్వభావము నిన్ను చెడు విషయాలు చేయుటకు పురిగొల్పుచున్నందున, దానిని నీలో నుండి తీసివేసినట్లు చూపించెను" (కొలొస్స 2:11). ఈ విధమైన హృదయము మనస్సులో మార్పును పౌలు బాప్తిస్మమునకు జత చేయుచున్నాడు. మనము బాప్తిస్మము తీసుకున్నప్పుడు పాత జీవితము, స్వభావము యేసుతో మరణించును. అటు తరువాత ఒక నూతన మనిషిగా తిరిగి జీవములోనికి వస్తాము. (కొలస్సి 2:11,12) ఇంకా పౌలు ఈ విధంగా వివరించెను. "ఒక సమయములో అపరాధముల వలనను, సున్నతి పొందనందునను మీరు మృతులైయుండిరి. ఇప్పుడైతే క్రీస్తుతో కూడ దేవుడు మిమ్మును తిరిగి జీవింపజేసెను. మనము చేసిన ప్రతి అపరాధమునుండి ఆయన మనలను క్షమించెను (కొలొస్స 2:13).

ధర్మశాస్త్రములో మనకు వ్యతిరేకముగా వ్రాయబడిన విషయాలను గూర్చి మరొకసారి చూద్దాము (కొలస్సి 2:14). ఈ మాటలు గ్రీకు భాషలోని ఒక పదము నుండి వస్తున్నది. అనగా "న్యాయమునకు అనుకూలముగా ఉండు ఆజ్ఞ" అని అర్థము. ఆ ఆజ్ఞలు ప్రభుత్వమునుండి గాని క్రైస్తవ సంఘమునుండి గాని రావచ్చును. ఈ గ్రీకు పదమును పౌలు మరొకసారి మాత్రమే అనగా అర్పణములకు సంబంధించిన విధిరూపకమైన ఆజ్ఞలను గూర్చి మాట్లాడెను (ఎఫెసి 2:14,15). ఈ ఆజ్ఞలు యూదులకు మరియు యూదులు కాని వారికిని మధ్య ఒక గోడ వలె ఉండి వారిని వేరు చేస్తున్నది. కొలొస్సయు 2లో పౌలు ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలో వెలిబుచ్చిన భావమును అర్థము చేసుకోవాలని కోరుచున్నాడు. యూదులు కానట్టి క్రైస్తవులు జంతువులను అర్పించవలెననెడి మోషే ధర్మశాస్త్రమును గూర్చి ఇక ఎన్నడు ఆందోళన చెందనవసరము లేదు అని పౌలు స్పష్టముగా కోరుచున్నాడు. ఇంకా ముందుకు వెళ్ళి వారు, అనగా యూదులు కాని క్రైస్తవులు ఆత్మీయముగా పవిత్రులనుగా చేయబడుటకు నియమింపబడిన ఆజ్ఞలను గాని, లేక సున్నతి పొందవలెను అనే యూదయ క్రైస్తవులు చేయుచున్న ఒత్తిడికి గాని మీరు లొంగిపోనవసరములేదని పౌలు చెప్పెను.

**అందుచేత మనకు అర్థమయ్యే విషయమేమంటే, దేవుడు పది ఆజ్ఞలను సిలువకు మేకులతో కొట్టివేసెనని పౌలు చెప్పలేదు అని గ్రహించాలి. వేరొక చోట కూడా పౌలు ఇట్లా చెప్పెను. పది ఆజ్ఞలను మీరుటయే పాపము అని చెప్పెను (రోమా 7:7).**

బుధవారం మార్చి 4

**ఒక నకలు లేక నిజమైనదా? (కొలొస్సయి 2:16-19)**

**మనుష్యులు ఏర్పాటు చేసిన నియమములు లేక పద్ధతులను గూర్చి కొలొస్స 2:16–19లో చదువుడి. ఈ నియమములతో ఉన్న సమస్య ఏమిటి?**

క్రైస్తవ సంఘములో ఉన్న సమస్యను గూర్చి కొలొస్సయి 2:16–19 చాల సమాచారమును మనకు అందిస్తుంది. అక్కడ యూదయ క్రైస్తవులకును, యూదేతరులకును మధ్య ఒక సమస్య చెలరేగినది. (కొలొస్స 2:13) కొలొస్సయిలోని క్రైస్తవ సంఘములో అధిక శాతము మంది యూదులు కాని వారే సంఘ సభ్యులుగా ఉన్నారు. యూదయ క్రైస్తవులు మనుష్యులు ఏర్పరచిన నియమములను తప్పనిసరిగా పాటించాలని యూదులు కాని క్రైస్తవులపై ఒత్తిడి తీసుకొనివచ్చిరి. అయితే మనుష్యులు ఏర్పాటు చేసిన ఆ పద్ధతులు, ఆ నియమములు పాటించనవసరములేదని పౌలు చెప్పెను.

కొలొస్సయి 2:16 యూదులు ఆచరించుచున్న నియమములు పట్టిక చూపించుచున్నది. అనేకమంది యూదులు క్రైస్తవ విశ్వాసమును అంగీకరించి క్రైస్తవ సంఘములో సభ్యులుగా చేరిన తరువాత కూడా వారి పూర్వపు యూదామతాచారములను విడనాడక, వాటిని కూడా అనుసరించి క్రైస్తవులుగా జీవిస్తున్నారు. ఆ యూదులలో కొంతమంది దేవదూతలను పూజించేవారు. లేక గర్విష్టులుగా ప్రవర్తించేవారు. యేసు ఈ భూమి మీద పరిచర్య చేసిన సమయములో యూదయ మత నాయకుల హృదయాలలో ఉన్న గర్వమును ఉద్దేశించి అది తగదని వారిని హెచ్చరించెను (మత్తయి 6:1,5,7,16 చదువుడి). అందువలన కొలొస్సయిలో ఉన్న సంఘమునకు ఎదురైన సమస్య పౌలుకు ఏమాత్రము క్రొత్త సమస్యగా కనిపించలేదు. ఇతర ప్రాంతములలో ఉన్న సంఘాలలో కూడా అనేక సమస్యలు ఉన్నట్లు పౌలు చూసాడు.

నేడు కూడా అనేకమంది క్రైస్తవులు కొలస్సయి 2:16ను తప్పుగా గ్రహించారు కాబట్టి దానిని మనము జాగ్రత్తగా పరిశీలిద్దాము.

అందుచేత (కొలొస్సయి 2:16) అనే మాటను బట్టి మనము ముందుగా చదివిన వాక్యములకు పౌలు తన యొక్క భావము ఏమైయున్నదో తెలియపరచి ఆ చర్చనీయాంశమునకు ఒక ముగింపును తీసుకొని రావాలని యోచించుచున్నాడు. క్రైస్తవులు సున్నతి పొందనవసరములేదని పౌలు చెప్పెను. యూదులు వారు దేవునికి చెందినవారని ప్రకటించుకొనుటకు మగవారందరు సున్నతి పొందవలెనను అనే ఆచారమును స్థాపించారు. అయితే సున్నతి పొందుట అనునది ప్రాముఖ్యమైన విషయము కాదు గాని ఒక నూతన హృదయమును కలిగియుండుట చాలా అవసరమని పౌలు చెప్పెను (కొలొస్స 2:11–15).

పౌలు ఇంకా మాట్లాడుతూ కొలొస్స 2:16లో ఇశ్రాయేలీయులు ఆలయమునకు తీసుకొనివచ్చిన అర్పణలైన అన్నపానములను గురించి చెప్పుచున్నాడు. ఈ వాక్యములో పేర్కొనబడిన ఇతర విషయాలైన ప్రత్యేక పండుగ దినములను గూర్చి కూడా పౌలు

మాట్లాడుచూ, వీటిని విధిగా యూదులు పాటించుచున్నారుగాని నిజముగా క్రైస్తవులైన వారు వాటిని పాటించవసరములేదని పౌలు స్పష్టముగా చెప్పుచున్నాడు (హోషేయ 2:11; లేవి 23:11,24,32 చదవండి).

**ఇవన్నియు కూడా అనగా ఈ పద్దతులు ప్రత్యేక పండుగ దినములు రాబోవు వాటి ఛాయయే గాని నిజ స్వరూపము క్రీస్తులో ఉన్నది అని చెప్పెను (కొలొస్స 2:17). ఈ ప్రత్యేక దినములు యేసు యొక్క భవిష్యత్తు కార్యమును మనకు సూచించుచున్నవని పౌలు వివరిస్తున్నాడు (1కొరింథి 5:7; 1కొరింథి 15:23) దేవుడు సబ్బాతు దినమును ఏదెనులో పాపము ప్రవేశించక ముందే లేక ప్రాయశ్చిత్తమునకు మొట్టమొదటగా బలియర్పణ చేయక పూర్వమే ఆరంభించెను. అందుచేత యేసు సిలువ మీద మరణించిన తరువాత సబ్బాతు ఆజ్ఞ కొట్టి వేయబడలేదు లేక సబ్బాతు దినమును ఆచరించడమనునది అంతటితో ఆగిపోలేదు.**

## గురువారం మార్చి 5

## పరిమితులు మరియు చట్టములు (కొలొస్స 2:20-23)

**క్రైస్తవ సంఘానికి పౌలు ఇచ్చిన సలహాలు, హెచ్చరికలు ఏమిటి? జవాబు కొరకు కొలొస్సయు 2:20-33 చదువుడి.**

జంతువులను అర్పణములుగా అర్పించడమనే పనిని మనము చేయనవసరములేదని పౌలు చెప్పుచున్నాడు. యేసు ఏ పనిని చేయుటకు ఈ లోకమునకు వచ్చెనో అవి మనకు సూచించుచున్నవి. కావున యేసు సిలువ మీద మరణించిన తరువాత ఈ చట్టముల అవసరము ఇక లేదు.

అందుచేత క్రైస్తవులు, అనగా యూదయ క్రైస్తవులతో సహా ఈ చట్టములను ఇక పాటించనవసరములేదు. ఈ చట్టములను ఇక పాటించనవసరములేదని దేవుడు తన ప్రజలకు కనబడుచున్న ఒక గురుతును ఇచ్చెను. దేవాలయము యొక్క తెరను చించివేసిన పరలోకమునుండి వచ్చిన చేయి ఆ గురుతై యున్నది. ఈ తెరయే పరిశుద్ధ స్థలము నుండి అతి పరిశుద్ధ స్థలమును వేరు చేసినది. జంతువుల అర్పణములు ఇక అవసరము లేకపోయినను మనము వాటిని అర్పించుచునే వుంటే ఏమవుతుంది? అప్పుడు మనము ఈ జీవితమునకు సంబంధించిన వారము మాత్రమే తప్ప దేవుని రాజ్యములో సభ్యులము కాలేదని చూపించుకొనుచున్నాము.

ఒక నూతన ఆకాశము మరియు ఒక నూతన భూమి కొరకు మనము నిరీక్షించుచున్నాము. వాటి కొరకే మనము కనిపెట్టి చూస్తున్నాము. ప్రతి మంచి దానికి, సక్రమమైన దానికి అది నివాసముగా ఉండును (2పేతురు 3:13). ఆ సమయమున దేవుడు సమస్తము నూతన పరచునని వాగ్దానము చేసెను.

మోషే యొక్క ధర్మశాస్త్రమునకు యూదయ మత నాయకులు మరికొన్ని మానవులు నియమించిన చట్టములను కలిపిరి (మార్కు 7:1-13 చదువుడి). ఆ మానవ చట్టాలు భారముగా తయారైనవి. క్రైస్తవుల యొక్క విశ్వాసము ఎదుగుటకు అవి సహాయపడలేదు. అవి మోయలేని బరువుగా తయారైనవి. కొంతమంది క్రైస్తవులు ఇతరులు చేయలేని వాటిని చేయుట ద్వారా మంచిగా ఉన్నాము అనే భావముతో చేస్తూ ఉంటారు. అటువంటి ఆలోచనా విధానము చాలా చెడ్డది. ఇటువంటి ప్రజలే వారు చేసే ప్రత్యేకమైన క్రియల ద్వారాను వారు అనుసరించుచున్న మానవ చట్టముల ద్వారాను ఏదో విధముగా వారంతట వారు నిత్యజీవమును సంపాదించుకొనవచ్చును అని భావిస్తారు.

గతించిపోయిన కాలములో అనేకమంది బైబిలు తత్వవేత్తలు, పరిశుద్ధాత్మ చేసే పనులను చేయుటకు ప్రయత్నించి పొరపాటు చేసారు. ఇతరుల జీవితములలోని పరిశుద్ధాత్మను తొలగించారు. బైబిలు ఏమి బోధిస్తున్నదో దానిని బోధించుటకు ఈ బైబిలు తత్వవేత్తలు ప్రయత్నించారు. అయితే వారు చేయాలనుకున్న పని వారిది కాదు. అవి దేవుని పనియైయున్నది. యేసే సత్యము. ఆయన పౌలుకును, ఇతర బైబిలు గ్రంథకర్తలకును వారు ఏమి వ్రాయాలో వారికి దేవుడు తెలియపర్చాడు.

**యేసు 'మన కొరకు' మరియు మనలోను పనిచేయును. సిలువ యొద్ద యేసు మన కొరకు చేసిన పని ఏమిటి? మనలో యేసు చేసిన పని ఏమిటి? యేసు మనలో చేసిన పనిని బట్టియే ఆయన మన కొరకు సిలువ మీద ఎందుకు పని చేసెను?**

**శుక్రవారం** **మార్చి 6**

## అదనపు అధ్యయనము

"నూతన నిబంధన కాలములలో జనులు బైబిలునందు విశ్వాస ముంచకుండా కొంతమంది మనుష్యులు ప్రయత్నించారు. వారు ఏవిధముగా అలా చేయగలిగారు? వారు మానవులు ఏర్పాటు చేసిన చట్టములను, అభిప్రాయములను అమలు పర్చుట ద్వారా వారు చేయగలిగిరి. నేడు సాతానుడు కూడా అదే పని చేయుటకు ప్రయత్నించుచున్నాడు. అబద్ధ భావాలను ప్రజలు అంగీకరించే విధముగా అతడు ప్రయత్నించుచున్నాడు. అందువలననే అనేకమందికి బైబిలు అనగా నూనెలేని ఒక దీపము వంటిదిగా ఉన్నది. ఈ ప్రజలు వారిని భ్రమపరచే అబద్ధ బోధనలను అంగీకరిస్తున్నారు. అటుతరువాత బైబిలును అపార్థము చేసుకుంటారు లేక తప్పుగా అర్థము చేసుకుంటారు. బైబిలునందు వారికున్న విశ్వాసమును అబద్ధ భావములు నాశనము చేస్తున్నాయి. బైబిలు అనగా దేవుడు మనకు పంపించిన వర్తమానము అనే విషయాన్ని నమ్మకుండా ప్రజలను ఈ అబద్ధ భావాలు ఆపాయి. ప్రజలు వీటిని అంగీకరించినపుడు బైబిలు మానవ జీవితాలను అదుపు చేయలేదు లేక వారిని మంచి మార్గములోనికి నడిపించలేదు. మరణించిన వారు బ్రతికియున్న మనుష్యులతో

సంభాషించగల్గుదురని నమ్మినపుడు మనుష్యులు వారంత వారు వారి జీవితము ద్వారా దేవుని యొక్క ధర్మశాస్త్రమును మార్చి వేసి వారి యొక్క మానవ భావాలను ఆ స్థానములో పెట్టి అదే దేవుని ధర్మశాస్త్రమని చెప్పుకుంటారు. వారు ఏమి చేయాలనుకుంటారో దానిని నిరభ్యంతరముగా చేయవచ్చు. అది దేవునికి అంగీకారమగునని నమ్ముదురు. వారు పాపము చేయవచ్చని కూడా నమ్ముదురు. పాపము అనగా స్వేచ్ఛ అని నమ్ముదురు. స్వేచ్ఛగా చేసిన పాపాలకు దేవునికి లెక్క చెప్పనవసరములేదని కూడా నమ్ముదురు.

ఇట్టి బోధనములను బోధించే వారిని క్రైస్తవులు కలుసుకుంటారు. ఇటువంటి అబద్ధ బోధకులకు వ్యతిరేకముగా అపొస్తలుడైన పౌలు కొలొస్సయిలోని సంఘమును హెచ్చరించెను. మనము మరణించిన వారితో సంభాషించవచ్చునని, బైబిలు ఆవిధముగా బోధించుచున్నదని ప్రజలకు ప్రచారము చేస్తారు. అయితే సజీవులమైన మనము ఈ బోధనములను అంగీకరించకూడదు. క్రైస్తవులు స్థిరమైన తీర్మానము తీసుకొని బలముగా సత్యానికి నిలువబడాలి. మన దృష్టి కేవలం యేసు మీదనే ఉంచాలి. యేసు బోధనలతో ఏకీభవించని అన్ని మానవ భావాలను తిరస్కరించాలి. బైబిలు సత్యమును ధ్యానించాలి. దేవుని మాటలు నమ్మాలి. బైబిలు చదివేటప్పుడు దేవుడు మనతో మాట్లాడుచున్నాడు. అపుడు దేవుని యొద్ద నుండి వచ్చు జ్ఞానమును నేర్చుకొందుము - ఎలెన్ జి వైట్, అపొస్తలుల కార్యములు, పుటలు 474, 475.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. పౌలు ఈ విధముగా చెప్పెను "ఏలయనగా దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది. మరియు ఆయనయందు మీరును సంపూర్ణులైయున్నారు. ఆయన సమస్త ప్రధానులకును అధికారులకును శిరస్సయి యున్నాడు (కొలొస్స 2:9,10). ఈ విషయాలు అనగా అర్థమేమిటి? జవాబు కొరకు (యోహాను 1:1; హెబ్రీ 1:3; 1పేతురు 3:22).
2. ఎక్కువ మంది కొలొస్స 2:14-16 చూపించి సబ్బాతును గైకొనక్కరలేదని వాదిస్తున్నారు. అట్లా బోధించుట ద్వారా వచ్చే సమస్యలేమిటి?
3. ఎలెన్ జి వైట్ వ్రాతలు పరిశీలిస్తే బైబిలును చదివేటపుడు దేవుడు మనతో మాట్లాడుచున్నాడని నమ్మాలి. ఈ అభిప్రాయానికి వ్యతిరేకముగా మాట్లాడి బైబిలు విశ్వాసమును తగ్గించే ఏ విషయమైనను మనలను మనం ఎట్లు కాపాడుకోవాలి?

❋✶❋